క్లుప్తంగా

పేద విద్యార్థికి చేయూత



జ్యోత్స్న కుటుంబ సభ్యులతో తోట జనార్దన్

కాటారం: మండల కేంద్రం పరిధిలోని దుబ్బగూడెంకు చెందిన గంట జ్యోత్స్న ఎంబీబీఎస్ చదువుతుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంది. విషయం తెలుసుకున్న కాటారం మాజీ ఎంపీటీసీ తోట జనార్దన్ జ్యోత్స్న ఇంటికి వెళ్లి మంగళవారం ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్‌లో ఆర్థికంగా తోడ్పాటును అందిస్తానని పేర్కొన్నారు. జనార్దన్ వెంట నాయకులు తోట బాపు, గంట శ్రావణ్, కొండ తిరుపతి, గ్రామస్తులు ఉన్నారు.

నియామకం



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బ్రాహ్మణపల్లి ఎస్సీకాలనీలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్‌మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కాల్వ మల్లయ్య, అధ్యక్షుడిగా పేట రాజు సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా అంబాల సంజీవ్, కార్యదర్శిగా నిట్టూరి అంకయ్య, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు రమేష్, ప్రచార కార్యదర్శిగా పేట రవిలను నియమించారు. ఈ కార్యక్రమంలో ఆత్కూరి సారయ్య, పేట దేవేందర్, మాదిగ యువసేన మండల అధ్యక్షులు మంత్రి రవితేజ, చింతకుంట సదానందం, చింతకుంట రాము తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

భూపాలపల్లి అర్బన్: సీపీఐ పట్టణ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. పట్టణ కార్యదర్శిగా సొత్కు ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా ఎండీ జాఫర్, పల్లి కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా మోటపలుకుల రమేష్, గురిజపల్లి సుధాకర్‌రెడ్డి, రాంచందర్, శ్రీనివాస్, సతీష్, సుగుణ, జోసెఫ్, శ్రీకాంత్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

వాజేడు : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే ప్రమాదం ఉన్నందున ఆరోగ్య సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని వాజేడు, పేరూరు వైద్యులు కొమరం మహేందర్, రాహిల్ అన్నారు. మండలంలోని మొరుమూరులో జ్వరాలపై ఇంటింటి సర్వేలు నిర్వహించి అనారోగ్యంతో ఉన్న వారికి మందులను ఇచ్చారు. గర్భిణులను, బాలింతలను పరీక్షించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఈఓ వేణుగోపాల కృష్ణ, కోటిరెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఉన్నారు.

టీబీ రోగులకు వైద్య పరీక్షలు

ఏటూరునాగారం : మండలంలోని రొయ్యూర్ పీహెచ్‌సీ పరిధిలోని రొయ్యూర్ గ్రామంలోని టీబీ, హెచ్‌ఐవీ, డయాలసిస్, షుగర్, బీపీ, థైరాయిడ్, కాలేయం వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసినట్లు మొదటి ఏఎన్‌ఎం ఝాన్సీలక్ష్మి తెలిపారు. మంగళవారం రొయ్యూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో 30 మందికి తెమడ, రక్తన మూనాలను సేకరించి పరీక్షలు చేశామని తెలిపారు. పాత వ్యాధిగ్రస్తులను వాహనం ద్వారా ఏటూరునాగారంలోని సామాజిక ఆస్పత్రికి తరలించామని చెప్పారు. పాజిటివ్ వచ్చిన వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఏఎన్‌ఎం పావని, హెల్త్ అసిస్టెంట్ నగేష్, రవి పాల్గొన్నారు.

సమాచారం అందిస్తే మరమ్మతు చేపడుతాం..

ములుగు రూరల్ : ప్రమాదకరంగా ఉన్న లైన్‌ల సమాచారం గ్రామ, మండల స్థాయి విద్యుత్ అధికారులకు సమాచారం అందించినట్లయితే వెంటనే మరమ్మతులు చేపడుతామని విద్యుత్ శాఖ డీ ఈ నాగేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, లూజ్‌గా ఉన్న లైన్‌లు, వంగిపోయిన స్తంభాలు ఉన్నట్లయితే వెంటనే సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు సహకరించిన వారు అవుతారని అన్నారు.

ఒకరికి తీవ్రగాయాలు

ఏటూరునాగారం : స్థానిక సామాజిక ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సోయం వరుణ్ సోమవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని బూటారం గ్రామానికి చెందిన వరుణ్ సామాజిక ఆస్పత్రిలో విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తుండగా 163 జాతీయ రహదారి ఎక్కెల క్రాస్‌వద్ద గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. చికిత్స నిమిత్తం అతడిని వరంగల్‌కు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని తోటి ఉద్యోగులు తెలిపారు.

పరిశుభ్రతపై పట్టింపేది?



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట పెరిగిన పిచ్చి మొక్కలు



గణపురంలో పందుల స్వైర విహారం

- డ్రెయినేజీల్లో పెరిగిన పిచ్చి మొక్కలు
- రోడ్లపైకి వస్తున్న మురుగు
- పట్టించుకోని అధికారులు

గణపురం: మండల కేంద్రం అపరిశుభ్రతతో అస్తవ్యస్తంగా మారింది. గ్రామంలో రోజు వారీగా చేయాల్సిన పరిశుభ్రత కార్యక్రమాలు సిబ్బందితో అధికారులు చేయించక పోవడంతో సైడ్ కాల్వల్లో పిచ్చి మొక్కలు, మట్టితో నిండిపోయి నీళ్ల వెళ్లకుండా మురుగు కుపాలుగా మారాయి. ప్రధాన రహదారితో పాటు కాలనీల వెంట నీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అలాగే గ్రామంలో పిచ్చి మొక్కలు పెరిగిన కూడా సిబ్బంది తొలగించడం లేదు. మరో పక్క పందులు, కుక్కలు గ్రామంలో స్వైర విహారం చేస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో కాలనీల వెంట దోమలు మరో పక్క పందులు, కుక్కలతో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉన్నాయి. ప్రతీ రోజు అందుబాటులో ఉంటు సిబ్బందితో గ్రామంలో నెలకొన్న



పోచమ్మ వాడలో పిచ్చి మొక్కలతో నిండిన డ్రెయినేజీ

సమస్యలను పరిష్కారించాల్సిన అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తమ కాలనీల్లో సైడ్ కాల్వలు శుభ్రం చేయాలని చెప్పిన పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో ఉన్న సైడ్ కాల్వలను శుభ్రపరచడంతో పాటు రోడ్ల మీద నీరు నిల్వ లేకుండా గుంతలను పూడ్చి వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో యుద్ధ ప్రాతిపదికన దోమల నివారణ మందు పిచికారీ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.

పట్టించుకోవడం లేదు



పోషమ్మ వాడలోని సైడ్ కాల్వలో పిచ్చి మొక్కలు పెరిగి మురుగు వెళ్లడం లేదు. దీంతో నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. దోమలు విపరీతంగా ఉన్నాయని సైడ్ కాల్వను శుభ్రం చేయాలని అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదు.

– పోశాల సాంబయ్య, గణపురం

రోడ్డు వెంట ప్రమాదకరంగా పిచ్చి మొక్కలు



మలుపు వద్ద ఉన్న పిచ్చి మొక్కలు

చిట్యాల: మండల కేంద్రం నుంచి నవాబుపేటకు వెళ్లే ప్రధాన రోడ్డు వెంట బియ్యం గోదాం సమీపంలోని చెరువుకట్ట కింద ఉన్న మలుపు వద్ద పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం నవాబుపేటకు చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై రాత్రి వెళ్తుండగా ప్రమాదవశాత్తు తాటిచెట్టుకు ఢీకొని మృతి చెందాడు. అలాగే గతంలో రెండు వాహనాలు ఎదురెదుగా వచ్చి ఢీకొన్నాయి. ఇలా ఎన్నో సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కావున సంబంధిత అధికారులు స్పందించి మలుపు వద్ద ఏపుగా ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తే ప్రమాదాలు జరుగకుండా ఉంటాయని వాహనదారులు కోరుతున్నారు.

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన

మొగుళ్లపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్లు అన్నారు. మండలంలోని పిడిసిల్ల ప్రాథమిక పాఠశాలలో ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ గౌర్రె సుమలత, మాజీ సర్పంచ్ నైనకంటి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ దండ వెంకటేశ్వర్‌రెడ్డి, మహమ్మద్ అబ్దుల్ నబీ, వెంకటేశ్వరరావు, కుమారస్వామి, ఉపాధ్యాయులు సంజీవ్, సుమన, అనసమ్మ పాల్గొన్నారు.



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

ఆర్థికాభివృద్ధి దిశగా ముందుకెళ్లాలి

- ఎల్‌ఈఏపీ ప్రాజెక్టు అసోసియేట్ దూహిత

కాటారం: గ్రామీణ మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి దిశగా ముందుకెళ్లాలని అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెనియర్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు అసోసియేట్ దూహిత అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కేంద్రంలో మంగళవారం స్వయం సహాయక బృందాల మహిళలకు ప్రభుత్వ పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పరిశ్రమల నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దూహిత మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ఏఎల్‌ఈఏపీ(అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెనియర్ ఆఫ్ ఇండియా) ప్రపంచ బ్యాంక్ నిధులతో కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఏఎంపీ, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల శాఖ, డీఆర్‌డీఏ, సెర్ప్‌లు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఆసక్తిగల మహిళలకు పదిహేను రోజుల పరిశ్రమల నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్‌పై నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ఏపీఎం లవకుమార్, మండల సమైఖ్య అధ్యక్షురాలు ఫర్హాన, అకౌంటెంట్ స్వప్న, సీసీ, వీఓ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న దూహిత

డేంజర్ జోన్ ఇళ్లు సేకరించాలి

మల్హర్: మండలంలోని పెద్ద తాడిచర్లలో ఓపెన్ కాస్ట్‌కు 500 మీటర్ల పరిధిలో ఉన్న డేంజర్ జోన్ ఇళ్లు సేకరించాలని తాడిచర్ల, కాపురం గ్రామాల భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు దండు రమేష్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. డేంజర్ జోన్‌లోని ఇళ్లు సేకరిస్తామని 2022 సంవత్సరం డిసెంబర్ 13న జెన్‌కో అధికారులు ప్రైమరీ నోటిఫికేషన్ జారీ చేశారని డిప్యూటీ సీఎంకు డేంజర్ జోన్ నిర్వాసితులు విన్నవించారు. కానీ ఇప్పటి వరకు నోటిఫికేషన్‌పై ఎలాంటి పురోగతి లేదని వెల్లడించారు. ఉపరితల బొగ్గు గని వలన దుమ్ము, ధూళీ, భూమి పొరల్లో నుంచి వెలువడే విష వాయువు వలన అనేక ఆర్యోగ సమస్యల భారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యాక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, కుంట సది, నిర్వాసితులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

మాలల అభివృద్ధికి తోడ్పాటును అందించాలి

కాటారం: మాల కులస్తుల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు భూపెల్లి రాజు, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కోరారు. భూపాలపల్లి పర్యటనకు వచ్చిన భట్టిని మాలమహానాడు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం మాల కులస్తుల పలు సమస్యలను ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దండ్రు రమేశ్, తదితరులు ఉన్నారు.

రేపు క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

మొగుళ్లపల్లి: తెలంగాణ క్రీడా పాఠశాలల్లో 2025–26 సంవత్సరానికి సంబంధించి 4వ తరగతిలో ప్రవేశం కోసం మండలంలోని మొట్లపల్లి ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి తెలిపారు. మంగళవారం మొట్లపల్లి ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించిన సన్నద్ధత సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో చదువుతున్న బాల బాలికలు అర్హులని క్రీడల్లో నైపుణ్యత చాటిన విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. నాలుగో తరగతి చదవడంతో పాటు 31 ఆగస్టు 2016 నుంచి సెప్టెంబర్ 1, 2017 సంవత్సరంలో జన్మించిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. విద్యార్థులు వారి వెంట ఆధార్‌కార్డు, స్టడి సర్టిఫికెట్ తీసుకొని క్రీడలకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 98667 44719 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు సందీప్, మహేష్, సంతోష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ కుమారస్వామి

కబ్జాకు గురైన శిఖం భూముల సర్వే

మంగపేట : మండలంలోని చెరుపల్లి, బోరునర్సాపురం రెవెన్యూ పరిధిలోని ఉప్పలనర్సయ్య చెరువులో కబ్జాకు గురైన శిఖం భూములను గుర్తించేందుకు తహసీల్దార్ తోట రవీందర్ ఆధ్వర్యంలో ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ ఎస్‌కే సఫియా ఆయకట్టు రైతులతో కలిసి మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చెరువులోని 56 ఖాల్సాలోని శిఖంలో సుమారు 20 ఎకరాల వరకు భూమి ఖబ్జాకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. త్వరలోనే చెరువుకు సంబంధించిన పూర్తి రికార్డులను పరిశీలించి చెరువులోని శిఖం భూమిని అందులో ఆక్రమణకు పాల్పడిన రైతులకు నోటీసులు జారీ చేసి భూముల చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. అధికారుల వెంట చెరువు ఆయకట్టు రైతులు ఉన్నారు.



భూములను సర్వే చేస్తున్న అధికారులు

చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు



భూపాలపల్లి రూరల్: ర్యాలీలో అంగన్‌వాడీ టీచర్లు, పిల్లల తల్లులు



టేకుమట్ల: గర్మిళ్లపల్లి..



మల్హర్: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

- ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక

కాటారం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు పడుతాయని ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక అన్నారు. కాటారం మండలం అంకుషాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ రాధిక మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివరాణి, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు హిదాబేగం, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని ఎడ్లపల్లి 1, ఎడ్లపల్లి 2, శభాషనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. చిన్నారుల్లో జ్ఞాపకశక్తి పెంపొందించేందుకు వారితో అక్షరాలను సులవుగా గుర్తుపట్టేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యను ఆట పాటలతో నేర్పించనున్నట్లు తల్లిదండ్రులకు వివరించారు.



కాటారం: ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ రాధిక, అంగన్‌వాడీ సిబ్బంది

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలను బాలింతలు, గర్భిణులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్ సునీత కోరారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాట ప్రోగ్రాంలో భాగంగా భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి ఎస్‌ఎం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పిల్లలకు సమూహికంగా అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ టీచర్లు రాజమ్మ, విలాస రాణి, ఇందిరా, హెల్పర్స్ సూరమ్మ, వినోద పాల్గొన్నారు.

టేకుమట్ల: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు పోషిని లావణ్య, గీద విజయ అన్నారు. మంగళవారం మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు బడి బాట, సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు అస్వరూప, అనూష, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సంగి ప్రవీన్, రాజు, పిల్లలు, తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఇళ్ల మంజూరులో జాప్యం'



మాట్లాడుతున్న పూర్ణచందర్, నాయకులు

కాటారం: మహాముత్తారం మండలంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో జాప్యం ఎందుకు జరుగుతుందో మంత్రి శ్రీధర్‌బాబు సమాధానం చెప్పాలని బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ డిమాండ్ చేశారు. మహాముత్తారం మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించిన జాబిత వెల్లడించాలని అన్నారు. ఎమ్మెల్యేలుగా ఉన్న నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతుంటే మంత్రిగా ఉన్న మంథనిలో మాత్రం మంజూరు జాబిత రాకపోవడం శోచనీయం అన్నారు. మండలంలో 341 కేటాయించినట్లు ప్రకటించారని ఇప్పటి వరకు వారికి ప్రొసీడింగ్‌లు ఇవ్వలేదని పేర్కొన్నారు. మాదరం గ్రామపంచాయతీని పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రకించిన అధికారులు అర్హులైన వారి జాబితా వెల్లడించలేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు కల్వచర్ల రాజు, డాక్టర్ రఫీ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తుల స్వీకరణ



కాటారం: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగరాజు



చిగురుపల్లిలో దరఖాస్తు స్వీకరిస్తున్న డీటీ శ్రీనివాస్

కాటారం: భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులు మండలంలో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం నస్తూర్‌పల్లి, రఘుపల్లి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సదస్సులు నిర్వహించారు. పలువురు రైతులు, భూయజమానులు పలు భూ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. నస్తూర్‌పల్లిలో 89, రఘుపల్లిలో 213 దరఖాస్తులు స్వీకరించినట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. ఈ సదస్సుల్లో నయాబ్ తహసీల్దార్ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

మల్హర్: మండలంలో గ్రామాల్లో ఈ నెల 3 నుంచి 17 వరకు భూ భారతి రెవెన్యూ సభలు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మంగళవారం చివరి రోజు రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని చిగురుపల్లి గ్రామంలో నిర్వహించిన సదుస్సులో 55 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఇప్పటి వరకు రెవెన్యూ సదస్సుల్లో 3228 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో రైతుల వద్ద నుంచి పెండింగ్ దరఖాస్తులను ఈనెల 20 వరకు స్వీకరిస్తామని వెల్లడించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం సమస్యలు పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ఏఎస్ఓ శివ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

చిట్యాల: మండలంలోని నవాబుపేట ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయి నీరు వృథాగా పోతుంది. కొన్ని నెలలుగా లీకేజీ అవుతున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.